
సాక్షి
మెదక్
బుధవారం ▪ 26 ▪ ఫిబ్రవరి ▪ 2025



ఎత్తిపోతల ఉత్తిదేనా?

కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. వివరాలు 10లో ▸



చిత్రం అదిరేట్టు

అతను కుంచె పడితే చిత్రం చిరునవ్వు నవ్వుతుంది. బొమ్మకి ప్రాణం వస్తోంది. వివరాలు 10లో ▸



కాంగ్రెస్ అభ్యర్థిని..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎమ్మెల్యే రోహిత్ కోరారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

'భూమాత' అమలు ఇంకెప్పుడు?

మెదక్ కలెక్టరేట్: భూమాత పోర్టల్‌ను ఇంకెప్పుడు అమలులోకి తీసుకొస్తారని రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాగయ్య, గౌరీలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తీసుకొస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి పన్నెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.రైతులకు పోడు భూముల సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, నాయకులు నరేందర్, శ్రీను, లచ్చాగౌడ్, రాములు, కుమార్ పాల్గొన్నారు.

యూరియా కొరత రానివ్వొద్దు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు యూరియా కొరత రాకుండా డీలర్లు ఎప్పటికప్పుడు స్టాక్ తెచ్చుకోవాలని ఏఓ స్వప్న సూచించారు. మంగళవారం మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, భాగ్యలక్ష్మి, డీసీఎంఎస్ తదితర ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి యూరియా ఇతర ఎరువుల స్టాక్, ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ప్రస్తుతం యూరియా అవసరం ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ తెచ్చుకోవాలని యజమానులకు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే యూరియా, ఇతర ఎరువులు అమ్మాలన్నారు. మోతాదుకు మించి యూరియా వాడవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



జాతరకు ముస్తాబైన దుర్గమ్మ ఆలయం

జన జాతరకు వేళాయే..

- నేటి నుంచే ఏడుపాయల జాతర
- పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి దామోదర
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జన జాతరకు వన దుర్గమ్మ ముస్తాబైంది. మహాశివరాత్రి పురస్కరించుకొని బుధవారం ప్రారంభం కానున్న జాతరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రభుత్వం తరఫున హాజరై దుర్గమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసింది. ఏర్పాట్లలో ఎక్కడా రాజీలేకుండా కలెక్టర్ రాహుల్‌రాజ్ చర్యలు చేపట్టారు. సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

భారీ ఏర్పాట్లు

తెలంగాణలోనే అతి పెద్దదైన ఏడుపాయల జాతర కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. సింగూరు నుంచి 0.35 టీఎంసీల నీటిని మంగళవారం విడుదల చేశారు. స్నానాల కోసం షవర్ బాత్‌లు, బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేశారు. నీటి ప్రమాదాలు జరగకుండా 150 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వైద్య క్యాంపులను ఏర్పాటు చేశారు. తాగు నీటి కోసం 144 కుళాయిలు, 27 ట్యాంకర్లు, 476 శౌచాలయాలు ఏర్పాటు చేశారు. 598 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. 400 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి జాతర వరకు ఉచిత బస్సు సౌకర్యాం కల్పించనున్నారు. జాతరలో మద్య నిషేధం కోసం మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు నిరంతర విద్యుత్ అందించనున్నారు. ఆలయం ముందు షామియానాలు, క్యూలైన్లు, మంజీరా నదిలో శివుని విగ్రహం ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తు, కలెక్టర్ రాహుల్ రాజ్

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు: కలెక్టర్

జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ నగేష్, డీఎస్పీ ప్రసన్న కుమార్, ఆర్డీఓ రమాదేవితో కలసి ఏడుపాయల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జాతరలో తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యం విషయాలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నోడల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. మూడు షిఫ్టులలో పారిశుద్ధ్య సిబ్బంది పనులు చేయాలని ఆదేశించారు. హెల్ప్ డెస్కలను ఏర్పాటు చేసి, సమన్వయ పరుచుకోవాలని సూచించారు.

883 పోలీసులతో బందోబస్తు: డీఎస్పీ

జాతరలో ఎలాంటి ఇబ్బందుల కలుగకుండా 883 పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు, ముగ్గురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 61 మంది ఎస్సైలు, 45 మంది ఏఎస్ఐలు, 96 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 301 మంది కానిస్టేబుళ్లు, 91 మంది మహిళా కానిస్టేబుళ్లు, ,252 మంది హోంగార్డులు, 14 మంది మహిళా హోంగార్డులు విధుల్లో ఉంటారని ఆయన వివరించారు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ
- బరిలో 71 మంది అభ్యర్థులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికలకు ఒక్కరోజే సమయం ఉండటంతో అభ్యర్థుల ప్రచారం జోరందుకొంది. 26న మహాశివరాత్రి పర్వదినం, 27న ఏడుపాయలలో మహాశివరాత్రి జాతర ఉండడంతో ఓటు వేసేందుకు ఓటర్లు వస్తారో లేదోనని అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి మొత్తం 71 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 15, పట్టభద్రుల పోటీలో 56 మంది పోటీలో ఉన్నారు. అయితే స్వతంత్ర అభ్యర్థులు అత్యధికంగా పోటీ పడుతున్నారు.

43 పోలింగ్ కేంద్రాలు

ఇప్పటికే ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి కావచ్చింది. అలాగే జిల్లాలో 1,347 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 21 పోలింగ్ కేంద్రాలు; 12,472 మంది పట్టభద్రులు ఓటర్లు ఉండగా 22 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలపై నిఘా పెట్టారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మహేశ్ దత్ ఇటీవల మెదక్‌కు చేరుకొని వివిధ నోడల్ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేశారు.

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు

మెదక్ సమీకృత కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో 24న పోలింగ్ అధికారులకు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా అదనపు కలెక్టర్ నగేశ్, మాస్టర్ ట్రైనర్ తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర రెడ్డి శిక్షణ ఇచ్చారు. పోలింగ్ ప్రక్రియకు వినియోగించే బ్యాలెట్ బాక్సులు, అన్ని రకాల ఫారంలతో పాటు నమూనా ఓటింగ్ ప్రక్రియను అధికారులతో సాధన చేయించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉంటాయని, ఓటింగ్ గోప్యతను అమలయ్యేలా చర్యలు చేపట్టారు. కాగా జిల్లా కేంద్రంలో ఎన్నికల అధికారులకు బుధవారం పోలింగ్ సామగ్రి అందజేయనున్నారు.

నోటాకు నో చాన్స్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈవీఎంలు ఉండవు కాబట్టి బ్యాలెట్ పత్రాలు ద్వారానే ఓటింగ్ నిర్వహిస్తారు. దీంతో ఈ ఎన్నికలలో నోటాకు అవకాశం లేదు. ఎన్నికల నిర్వహణకు ఆరుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, ముగ్గురు వీఎస్‌టీలు, 21 మంది ఏంసీసీలు, తొమ్మిది మంది సెక్టోరియల్ అధికారులు, 22 మంది పోలింగ్ అధికారులు, 22 మంది సహాయ అధికారులు, 44 మంది ఇతర సిబ్బంది, 22 మంది మైక్రో అబ్జర్వర్లను ఇప్పటికే నియమించారు. పోలింగ్, పోలీస్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేస్తున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

ప్రలోభాలకు ఎర

మెదక్‌జోన్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియడంతో ఇక ప్రలోభాలకు తెరలేపారు. ఒక్కో ఓటుకు రూ.2వేల నుంచి రూ.5 వేల వరకు ఆఫర్ ఇస్తున్నారని సమాచారం. ఎక్కువ శాతం ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. అలాగే.. కొన్నిచోట్ల విందులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. 'నా వద్ద పది ఓట్లున్నాయి. ఎంత ఇస్తారు. ఫలానా పార్టీవారు ఓటకు రూ.2 వేలు అంటున్నారు. మీరు ఏమైనా ఎక్కువ ఇస్తే మీకే వేస్తాం ''అంటూ బేరసారాలకు దిగుతున్నారు. దీంతో రెండు ప్రధాన పార్టీలతో పాటు ఒకరిద్దరు స్వతంత్ర అభ్యర్థులు సైతం పోటీపడి ఓట్లను కొనుగోలుకు తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిసింది. సాధారణ ఎన్నికలను తలదన్నే విధంగా పట్టభద్రుల ఎన్నిక జరుగుతుంది.



భౌతిక శాస్త్ర అధ్యయనం మరింత సులభం



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

మెదక్ కలెక్టరేట్: వర్చువల్ ల్యాబ్ వల్ల సైన్స్ ఉపాధ్యాయులు.. విద్యార్థులకు ప్రయోగ అనుభవాన్ని సులభంగా అందించగలరని డీఈఓ రాధా కిషన్ అన్నారు. మంగళవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'సైన్స్ భావనలు - ప్రయోగ అనుభూతి, భౌతిక శాస్త్ర బోధనలో వర్చువల్ ల్యాబ్ -సిమ్యులేషన్'అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ పరికరాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో భౌతిక శాస్త్ర అధ్యయనాన్ని మరింత బోధనాపరంగా, ఆచరణాత్మకంగా తీర్చిదిద్దవచ్చునని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను మెరుగుపరచుకొని, సైన్స్ పాఠాలను మరింత చక్కగా బోధించగలరని వివరించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ తిరుమల్ రెడ్డి, ఐఏపీటీ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌తోపాటు అధ్యాపకులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. కాగా, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపీటీ) సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

పండ్ల ధరలు పైపైకి..



శివరాత్రి పండుగ సందర్భంగా పండ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండ్లు కొనుగోలు విషయంలో ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ.50కు డజన్ ఉండాల్సిన అరటి పండ్లు రూ.80, ఆపిల్ పండ్లు రూ.200 నుంచి 250కి కేజీ, ద్రాక్ష పండ్లు రూ.60 నుంచి రూ.100కు, 60కి కేజీ అమ్మాల్సిన జామ 100కు విక్రయిస్తున్నారు. పూల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. పండుగ సీజన్ కాబట్టి వ్యాపారులు కూడా అమాంతం ధరలు పెంచేశారు.

– చేగుంట(తూప్రాన్):

పట్టాలెక్కని కల

- మూతపడిన శంకాపూర్ రైల్వేస్టేషన్
- ఏళ్లుగా పున:ప్రారంభానికి నోచుకోని వైనం
- శ్రమకోర్చి రైల్వేస్టేషన్ ఏర్పాటు చేసుకున్న గ్రామస్తులు
- చందాలతో ప్లాట్‌ఫారం, స్టేషన్ గది నిర్మాణం
- మూణ్నాళ్ల ముచ్చటగానే రైలు కూత

చిన్నశంకరంపేట(మెదక్): ఎన్నో ఎళ్ల కల సాకరమైందన్న ఆనందం అంతలోనే ఆవిరైంది.. తమ గ్రామం నుంచి రైలు వెళ్తున్నా తమకు రైలు కూత తప్ప ప్రయాణం చేసే భాగ్యం లేదా అని గ్రామస్తులు శ్రమకోర్చి ఏళ్ల ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి రైలు కలను సాకారం చేసుకున్నారు. రెండు రైళ్లను హల్టింగ్ కూడా ఇచ్చారు. అంతా బాగానే నడుస్తుంది అనుకున్న నేపథ్యంలో కరోనాతో ఒక్కసారిగా కల తలకిందులైంది. కరోనా సమయంలో కేంద్రంలో చాలా వరకు రైల్వే స్టేషన్ మూసి వేయగా అందులో నార్సింగి మండలం శంకాపూర్ రైల్వే స్టేషన్ ఒకటి. అనంతరం మళ్లీ తెరిచి రైళ్లను యథావిధిగా కొనసాగిస్తున్నారని అనుకున్న గ్రామస్తుల కల మళ్లీ పట్టాలెక్కలేదు.

సొంతంగా ప్లాట్ ఫారమ్, స్టేషన్ గది నిర్మాణం

శంకాపూర్ గ్రామ శివారు మీదుగా ఉన్న సికింద్రాబాద్–నిజామాబాద్ రైల్వే మార్గంలో నిత్యం అనేక రైళ్లు నడుస్తుంటాయి. కానీ ఇక్కడ రైల్వేస్టేషన్ లేకపోవడంతో రైళ్లు ఆగేది కాదు. 2006 అప్పటి కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి బండారు దత్తాత్రేయను గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి కోరడంతో రైల్వేస్టేషన్ మంజూరైంది. మంత్రి ఆదేశంతో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు ముందుకొచ్చిన రైల్వే అధికారులు గ్రామస్తులు సొంతంగా ప్లాట్ ఫారమ్, స్టేషన్ గదిని నిర్మించుకోవాలని సూచించారు. దీంతో గ్రామస్తులు ఇంటికి ఇంత పోగుచేశారు. డబ్బులకు తోడు శ్రమదానం చేసేందుకు ముందుకొచ్చి ప్లాట్ ఫారం, స్టేషన్ గదిని కూడా నిర్మించుకున్నారు.

పక్క స్టేషన్లకు వెళ్లి ఎక్కే పరిస్థితి

నార్సింగి మండలంలోని శంకాపూర్, జప్తిశివనూర్ గ్రామాలతోపాటు చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్, కుమ్మరిపల్లి, రామాయపల్లి గ్రామాల ప్రజలకు రైలు సౌకర్యంగా ఉండేది. ఖాజాపూర్ గ్రామ శివారులో ఐరెన్ స్టీల్ పరిశ్రమ ఉండడంతో ఇతర రాష్ట్రాల కార్మికులకు అనువుగా ఉండేది. దీనికి తోడు రోజు ప్రయాణికులు సికింద్రాబాద్–నిజామాబాద్ మధ్యన ప్రయాణించేవారు. రైల్వే అధికారులు రైల్వేస్టేషన్ మూతవేయడంతో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మిర్జాపల్లి, అక్కన్నపేట రైల్వేస్టేన్‌లకు వెళ్లి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎంపీకి వినతి..

ఈ విషయంపై స్థానికులు రైల్వే అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం దక్కలేదు. మెదక్ ఎంపీగా గెలిచిన రఘునందన్‌రావు దృష్టికి శంకాపూర్ గ్రామస్తులు తీసుకెళ్లారు. ఇప్పటికీ రైల్వే అధికారులు స్పందించడం లేదు. రఘునందన్‌రావు చొరవ తీసుకొని రైల్వేస్టేషన్‌ను పునరుద్దరణకు కృషి చేయాలని శంకాపూర్, ఖాజాపూర్ గ్రామ ప్రజలు వినతిపత్రం అందించారు.



నార్సింగి మండలం శంకాపూర్ రైల్వేస్టేషన్

2019లో ఆగిన కూత

తమ కలసాకరమైతుందన్న ఆనందంతో 2008లో అప్పటి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎంపీ సర్వే సత్యనారాయణను పిలిచి పండుగ వాతావరణంలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి రోజుకు రెండు ప్యాసింజ్ రైళ్లను నిలిపారు. దీంతో సికింద్రాబాద్–నిజామాబాద్ మధ్య రైలు ప్రయాణం చేస్తూ గ్రామస్తుల సంబురపడ్డారు. 2019లో కరోనా ఉధృతి నేపథ్యంలో కేంద్రం కొన్ని రైల్వేస్టేషన్‌లను మూసివేసింది. శంకాపూర్ రైల్వే స్టేషన్‌ను కూడా మూసివేయగా అనంతరం అన్ని రైల్వేస్టేషన్‌ల మాదిరిగానే తిరిగి ప్రారంభిస్తారని గ్రామస్తులు భావించారు. కానీ గ్రామస్తుల ఆశల మీద నీళ్లు చల్లుతూ రైల్వే అధికారులు స్టేషన్‌ను ప్రారంభించలేదు. గతంలో హల్టింగ్ ఉన్న కాచిగూడ–సికింద్రాబాద్, బోధన్–సికింద్రాబాద్ రెండు ప్యాసింజర్ రైళ్లను కూడా నిలపకుండా ఉత్తర్వులు ఇచ్చారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ వైపే పట్టభద్రులు

ఏఐసీసీ జనరల్ సెక్రటరీ విష్ణునాథ్



మాట్లాడుతున్న విష్ణునాథ్

మెదక్‌జోన్/నర్సాపూర్/చిన్నశంకరంపేట(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ విష్ణునాథ్ అన్నారు. మంగళవారం మెదక్, చిన్నశంకరంపేట మండలం మిర్జాపూర్‌లలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో, అలాగే.. నర్సాపూర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు కరువయ్యారని, అందుకే పోటీకి దూరంగా ఉందని విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీలు రాజకీయ ఒప్పందం చేసుకున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రోహిత్‌రావు, మధుసూదన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు నీలంమధు ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



యువకుడి మృతదేహం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు మంగళవారం స్థానిక ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సుమారు 30 ఏళ్ల వయసు ఉంటుందని, పచ్చని టీషర్ట్, నల్లని నెక్కర్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. తెలిసిన వారు 8712657930కు ఫోన్ చేయాలని సూచించారు.

పోలీసు వాహనం బోల్తా

- ఆరుగురు సిబ్బందికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: ఎస్కార్ట్ కోసం వెళ్తున్న పోలీసు వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఆరుగురు సిబ్బందికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా కంది జైలులో ఉన్న ఖైదీలను తీసుకురావడానికి మంగళవారం సైబరాబాద్ నుంచి ఏఆర్ పోలీస్ సిబ్బంది ఓఆర్ఆర్ రహదారి మీదుగా వాహనంలో వెళ్తున్నారు. పటాన్‌చెరు టోల్ గేట్ సమీపంలో వాహనం వెనుక టైరు పంచర్ అయ్యి అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గౌండ్ర శ్రీకాంత్, కానిస్టేబుల్‌లు రఫిక్, సురేశ్, శ్రీధర్‌కు తీవ్రంగా గాయాలు అయ్యాయి. మరో ఇద్దరి కానిస్టేబుళ్లు ఆనంద్, నర్సింహలుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైటెక్ సిటీలోని యశోదా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ శ్రీధర్ మంగళవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎత్తిపోతల ఉత్తిదేనా?

- మరమ్మతులకు నోచుకోని ఎత్తిపోతలు
- తగ్గుముఖం పట్టిన భూగర్భజలాలు
- చండూర్, గంగారం గ్రామాల్లో అధ్వాన పరిస్థితులు
- 1,300 ఎకరాలకు అందని సాగు నీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- పట్టించుకోని అధికారులు

కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయకపోడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఆయకట్టు రైతులు సాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో పంట చేతికి వచ్చే సమయానికి పరిస్థితి ఏంటోనని ఆందోళనలో చెందుతున్నారు చిలప్‌చెడ్ మండలంలోని చండూర్, గంగారం గ్రామాల రైతులు. ఈ రెండు ఎత్తిపోతల కింద సాగుకు 1,300 ఎకరాలు ఉన్నాయని అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– చిలప్‌చెడ్(నర్సాపూర్):

చిలప్‌చెడ్ మండలంలోని ఫైజాబాద్, చండూర్, గంగారం గ్రామాల్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ 2004లో పల్లెబాటలో భాగంగా మంజీరా నది ఒడ్డున ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. 2009లో అప్పటి కాంగ్రెస్ పార్టీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సునీతారెడ్డి భూమి పూజ చేశారు. సుమారు రూ.13.40 కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల నిర్మాణాలు 2013లో పూర్తయ్యాయి. ఎత్తిపోతలతో సుమారు 2,100 ఎకరాలకు పుష్కలంగా సాగు నీరు అందేది. దీంతో 1,500 మంది రైతులు ఏటా రెండు పంటలు పండించేవారు.

కమ్మేసిన మట్టి, ముళ్ల పొదలు

ఫైజాబాద్ మినహా ఐదేళ్లుగా చండూర్, గంగారం గ్రామాల్లో ఎత్తిపోతలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. రెండేళ్ల కిందట మంజీరా నదికి వరదల తాకిడి ఎక్కువ కావడంతో ఒడ్డుకు ఉన్న గంగారం, చండూర్ ఎత్తిపోతలు దెబ్బతిన్నాయి. ప్రాజెక్ట్ వెళ్లే దారులు వరదలకు కోతకు గురయ్యాయి. చాలా కాలంగా వాటి వైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. దారులు మూసుకుపోవడంతో పాటు, ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లను చుట్టూ మట్టి, ముళ్ల పొదలు కమ్మేశాయి. ఎత్తిపోతలు నడవడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, స్టార్టర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇన్ టెక్ వాల్స్, పైపులు సైతం పాడైపోయాయి. మరమ్మతులు చేసేందుకు రైతులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.



చండూర్ శివారులో ముళ్లపొదల మధ్య ఎత్తిపోతల ప్రాజెక్ట్

1,300 ఎకరాలకు సాగు నీరు

ఈ రెండు ఎత్తిపోతలు ప్రారంభమైతే చెరువులు, కుంటలు నిండుకుండలా మారి సాగు నీరు అందడంతోపాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. చండూర్, గంగారం గ్రామాల్లో మరమ్మతులు జరగకపోవడంతో 1,300 ఎకరాలకు సాగు నీరు అందడం లేదు. భూగర్భ జలాలు మరింత తగ్గుముఖం పడితే రైతుల పరిస్థితి ప్రశ్నార్థకమే.



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

అధికారులకు విన్నవించాం



చండూర్ గ్రామంలో ఎత్తిపోతలకు మరమ్మతులు చేయించాలని నీటి పారుదల శాఖ డీఈకి వినతిపత్రం అందజేశాం. కొన్నేళ్లుగా ఎత్తిపోతలు పని చేయకపోవడంతో చాలా వరకు పంట నష్టపోయాం. ప్రస్తుతం పంటలు బాగానే ఉన్నా బోర్లు తక్కువయ్యాయి. పంట చేతికి వచ్చే సమయానికి, సాగుకు నీరు అందకపోతే పంట నష్టం తప్పదు. ఎత్తిపోతలు తిరిగి ప్రారంభమైతే సాగు నీటికి సమస్య ఉండదు.

– దాసరి శేషాద్రి, రైతు, చండూర్

రూ.13 లక్షలకు ప్రతిపాదనలు

చిలప్‌చెడ్ మండలంలోని చండూర్, గంగారం గ్రామాల ఎత్తిపోతల మరమ్మతులకు సుమారు రూ.13 లక్షలకు ప్రతిపాదనలు పంపించాం. వరద కారణంగా భారీగా దెబ్బతిన్న ఎత్తిపోతల మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంతో లేదు. త్వరలోనే పనులు చేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటాం.

– జగన్నాథం, ఇరిగేషన్ డీఈ, కొడిపల్లి

చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి

నర్సాపూర్ రాయరావు చెరువు వద్ద ఘటన



సునీల్‌గౌడ్ (ఫైల్)



ప్రవీణ్ (ఫైల్)

నర్సాపూర్ : చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ రాయరావు చెరువులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. నర్సాపూర్‌కు చెందిన డి.సునీల్‌గౌడ్(31), సారా ప్రవీణ్ (31) ఇద్దరూ స్నేహితులు. ఇళ్ల నుంచి సోమవారం సాయంత్రం బయటకు వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆచూకీ కోసం వెతుకుతుండగా మధ్యాహ్నం నర్సాపూర్ రాయరావు చెరువు వద్ద బైక్ కనిపించింది. పక్కనే మద్యం సీసాలు లభ్యమయ్యాయి. అనుమానంతో చెరువులో వెతకగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సునీల్‌గౌడ్ తండ్రి రెండేళ్ల కిందట మృతి చెందాడు. దీంతో సునీల్ గౌడ్ కల్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. మరో మృతుడు సారా ప్రవీణ్ కూడా చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. ఏడేళ్ల కింద ఇతడికి వివాహం కాగా భార్య, కుమారుడు ఉన్నారు. ఇతడు పేటీఎం సంస్థలో లోన్ రికవరీ పర్సన్‌గా డ్యూటీ చేస్తున్నాడు.

ఇంటర్, పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్మీడియెట్, పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ నగేష్, డీఈఓ రాధాకిషన్, ఆర్టీసీ డీఎం సురేఖ, డీఐఈఓ మాధవి ఇతర జిల్లా అధికారులతో కలసి ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పది పరీక్షలకు జిల్లాలో మొత్తం 68 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో మొత్తం 10,387 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 30 కేంద్రాలు

మార్చి5 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్ వార్షిక పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 14,224 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహిస్తారని, కాంపౌండ్ వాల్ లేని పరీక్ష కేంద్రాలకు బారికేడ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

జర్నలిస్టుల నిరసన

ఏడుపాయల ఈవో వైఖరిపై ఆగ్రహం



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఈవో చంద్రశేఖర్ వైఖరి నిరసిస్తూ మంగళవారం జర్నలిస్టులు బైఠాయించారు. జాతరకు సంబంధించిన సమాచారం తెలపడం లేదని జర్నలిస్టులు అక్కడే ఉన్న కలెక్టర్ రాహుల్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. సమీక్ష సమావేశంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నేలపై కూర్చొని నిరసన తెలిపారు. దీంతో కలెక్టర్ అవాక్కయ్యారు. ఈవో తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని, ఏ వివరాలడిగినా తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని ఫిర్యాదు చేశారు. మీకు సమాచారం కావాల్సి వస్తే ఆర్డీఓ రమాదేవిని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అడిషనల్ కలెక్టర్ నగేష్ జోక్యం చేసుకొని, జర్నలిస్టులను సముదాయించారు. సమాచారం ఇప్పించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. దీంతో జర్నలిస్టులు శాంతించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీనివాస్, సుమన్, శివచరణ్ సింగ్, భాస్కర్, శ్రీను, శ్యాం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

500 కోళ్లు మృత్యువాత

హత్నూర(సంగారెడ్డి): వైరస్ సోకి కోళ్లు మృత్యువాత పడిన ఘటన హత్నూర మండలం కాసాల గ్రామ శివారులో చోటు చేసుకుంది. కాసాల గ్రామానికి చెందిన సాలె రాములుకు గ్రామ శివారులో పౌల్ట్రీ ఫామ్ ఉండగా దేవులపల్లి గ్రామానికి చెందిన రాకేశ్ లీజుకు తీసుకొని పౌల్ట్రీ నిర్వహిస్తున్నారు. ఒక్కసారిగా వైరస్ సోకి ఐదు రోజుల నుంచి రోజు వందలాది కోళ్లు మృతి చెందుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే 500 కోళ్లు చనిపోయినట్లు పౌల్ట్రీ ఫామ్ నిర్వాహకులు తెలిపారు. దీంతో ట్రాక్టర్ ట్రాలీలో మృతి చెందిన కోళ్లను ఇతర ప్రాంతానికి తరలించి పాతిపెట్టారు. ఈ విషయమై దౌల్తాబాద్ పశు వైద్యాధికారి హేమలతను సంప్రదించగా నిర్వాహకులు తమకు సమాచారం ఇవ్వలేదని చెప్పారు. కానీ ఐదు రోజుల నుంచి కోళ్లు చనిపోతున్న విషయం తెలిసిందన్నారు. పౌల్ట్రీ ఫామ్‌ను సందర్శించి వివరాలు సేకరిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్) : అనుమానాస్పద స్థితిలో చెరువులో వ్యక్తి మృతి ఘటన మండలంలోని అందుగులపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన అక్కమొల్ల గణేశ్(40) సోమవారం ఉదయం వ్యవసాయ పొలం వద్దకని ఇంటి నుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం పొలం వద్ద చూడగా చెప్పులు కనిపించాయి. పొలానికి సమీపంలోని పెద్ద చెరువు వద్ద వెతుకుతుండగా గ్రామానికి చెందిన జగపతి తీసిన సంపులో శవమై కనిపించాడు. మృతదేహాన్ని బయటకు తీస్తుండగా మృతుడి కాళ్లు, చేతికి ఉన్న కడియంకు చేపల కోసం వేసిన వల చుట్టుకొని ఉంది. భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా కార్మికుడు..



రాములు (ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): అనుమానాస్పదంగా కార్మికుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మల్లెపల్లిలో గల యునైటెడ్ బేవరేజ్ పరిశ్రమలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మారేపల్లికి చెందిన ఉత్తెరపల్లి రాములు (30) రోజు మాదిరిగా మంగళవారం ఉదయం పరిశ్రమకు వచ్చాడు. రాములుకు పరిశ్రమలో ప్రమాదం జరిగిందని 7 గంటల సమయంలో తోటి కార్మికులు అతడి వరుసకు సోదరుడైన రాజుకు ఫోన్ చేసి చెప్పారు. దీనిపై యాజమాన్యం ఎలాంటి సమాచారం అందించలేదని గ్రామస్తులు, కుటుంబీకులు పరిశ్రమ ఎదుట బైఠాయించారు. మృతదేహాన్ని చూపించే వరకు కదిలేది లేదని, పరిశ్రమ యాజమాన్యమే రాములును హత్య చేసినట్లు అనుమానం ఉందని పోలీసులతో వాగ్వాదం చేశారు. చివరకు యాజమాన్యం దిగొచ్చి మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. మృతుడి సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరీశ్ శంకర్ తెలిపారు.

ఇంట్లో మరో వ్యక్తి..

సదాశివపేట (సంగారెడ్డి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శివన్న గారి ఈశ్వరప్ప(60) ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు తెరిచి చూడగా మూడు రోజుల కిందటే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభ్యర్థుల విజయం ఖాయం

జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులిద్దరి విజయం ఖాయమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య పోటీలో ఉన్నారని తెలిపారు. వారిద్దరి కోసం తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ కేంద్రంలో బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తున్నారని, తమకు ఓటర్ల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. రెండు స్థానాలు తమ పార్టీ కై వసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్లందరూ తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

పొట్టకూటికి వచ్చి వాగులో పడి మృతి

- కూడవెల్లి వాగులో కాళ్లు కడుక్కోవడానికి వెళ్లిన వ్యక్తి
- ప్రమాదవశాత్తు కాలిజారి పడిపోవడంతో మృత్యువాత



అంజయ్య మృతదేహం

మర్కూక్(గజ్వేల్): ప్రమాదవశాత్తు కూడవెల్లి వాగులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన బొంత అంజయ్య (40) రోజు మాదిరిగానే మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసొచ్చి నర్సన్నపేట, ఎర్రవల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలకు గుంతలు తీస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో పక్కనే కూడవెల్లి వాగులో కాళ్లు, చేతులు కడుక్కోవడానికి వెళ్లారు. ముందుగా వెళ్లిన అంజయ్య చేతులు కడుగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో పడిపోయాడు. వెంటనే కూతురు భారతి, అల్లుడు నవీన్ తమ వద్ద ఉన్న చీరను చెరువులోకి విసిరి కాపాడే ప్రయత్నం చేశారు. ఈత రాకపోవడంతో అప్పటికే అంజయ్య చెరువులో మునిగిపోయాడు. వారి అరుపులు విన్న గ్రామస్తులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కూతురు భారతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్యాన్సర్‌తో ఫీల్డ్ అసిస్టెంట్..



శ్రీనివాస్ (ఫైల్)

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల పరిధిలోని రాంసాగర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రామొల్ల శ్రీనివాస్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలు వేసుకొని మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీడీవో బాలయ్య కార్యాలయ సిబ్బందితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవి మండల కమిటీతో కలిసి రూ.8 వేలు సాయం అందించారు. గతేడాది శ్రీనివాస్ సోదరుడు మృతి చెందాడు. ఇద్దరు అన్నాదమ్ముళ్లు మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడింది. అలాగే తండ్రి గతంలోనే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య సుజాత కూతురు శ్రీవల్లిక, కుమారుడు నిశాంత్ ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో రాములు, టీఏ రవి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నది ఉన్నట్టు.. చిత్రం అదిరేట్టు

కళ్లు చెదిరిపోయే గోడ చిత్రాలు

- ఏ బొమ్మనైనా నిమిషాల్లో పేపర్‌పై దింపగలడు
- బహుముఖ ప్రతిభావంతుడు నవనీత్



వారణాసిలో గోడలపై గీసిన దేవుళ్ల కళాఖండాలు

హుస్నాబాద్: అతను కుంచె పడితే చిత్రం చిరునవ్వు నవ్వుతుంది. బొమ్మకి ప్రాణం వస్తోంది. మనసులో భావాలను పేపర్ పై అందంగా చిత్రీకరించగలడు. కలర్స్ లేకుండా మెర్కిల్స్ చూపించగలడు ఈ ఇంజనీర్. ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థల్లో విద్యా బోధన చేశాడు. సామ్ సాంగ్ కంపెనీలో డిజైనర్ ఇంజనీర్‌గా పని చేశాడు. తన ప్రతిభతో పది వరకు పెటెంట్లను పొందాడు. ప్రస్తుతం జీవ కళలకు జీవం ఉట్టిపడేలా గోడలపై పెయింటింగ్ వేస్తూ పురాణాలకు తిరిగి జీవం పోస్తున్నాడు బహుముఖ ప్రతిభావంతుడు నవనీత్.

హుస్నాబాద్ పట్టణానికి చెందిన పంతం నవనీత్ తండ్రి గోవర్ధన్ చనిపోగా, తల్లి కన్యాకుమారి కుట్టుమిషన్ నడుపుతూ కుమారుడిని చదివిస్తోంది. నవనీత్‌కు చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి ఉండేది. నాగ్‌పూర్‌లోని ఎస్‌ఐటీలో ఆర్కిటెక్చర్, బిల్ట్ ఎన్విరాన్మెంట్ కోర్సు పూర్తి చేశాడు. లైన్ ఆర్ట్‌లో అసాధరణమైన ప్రతిభను కలిగి ఉన్నాడు. ఆర్ట్స్ డిజైన్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని విజయం సాధించాడు. ఆర్కిటెక్ పోస్టర్ డిజైన్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. ముంబాయిలోని ఐడీసీ స్కూల్ ఆఫ్ డిజైన్‌లో కమ్యూనికేషన్ డిజైన్‌లో మాస్టర్స్ పూర్తి చేశాడు. ఈ కాలంలో కథా రచన, సినిమా, పిల్లల కోసం బొమ్మల కథలు మాస్ మీడియా కమ్యూనికేషన్ వంటి విభాగాలను విశ్లేషించి వాటి పై ఆసక్తి పెంచుకున్నాడు. ఎన్నో పోటీల్లో పాల్గొని పెటెంట్లను సొంతం చేసుకున్నాడు.

స్వీయ అభివృద్ధి కోసం నైపుణ్యం

చేతితో గీసిన బొమ్మలు, పెన్నుతో రాసిన అక్షరాలు మదిలో ఎప్పటికీ గుర్తుంటాయని నమ్ముతాడు నవనీత్. త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ఉద్యోగాలను దోచుకుపోతుంది. సృజనాత్మకత, పరిశోధన, విశ్లేషణ నైపుణ్యం లేకపోతే చాలా మంది ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెంచుకొని స్వస్థలమైన హుస్నాబాద్‌లో తల్లి సహాయంతో ఎంఎండబ్ల్యూడీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నారు. దీని ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలనే లక్ష్యం పెట్టుకున్నాడు.

గోడ చిత్రం ఆలయ స్థలంగా..

నవనీత్ అత్యంత ప్రసిద్ధ కళాకృతులను ఆవిష్కరించడంలో ఆయకు ఆయనే సాటి. వారణాసిలోని ఓ ప్రదేశంలో అక్కడి ప్రజలు చెత్త వేయడం, ఉమ్మి వేయడాన్ని గమనించాడు. 500 చదరపు అడుగుల గోడ పై వైరాగ్య సుందరం దేవత మూర్తులు కనిపించే విధంగా కళాకృతిని గీశాడు. చిన్న బ్రష్‌తో 6 రోజుల పాటు నిద్రాహారాలు మాని కళాఖండాన్ని నిర్మించాడు. ఈ గోడ చిత్రం ఆలయ స్థలంగా మలిచాడు. ప్రభుత్వ సంస్థలు, కళా సంఘాలు, విద్యా సంస్థలతో కలిసి వర్క్‌షాపులు, లైవ్ సెషన్లు, అతిథి లెక్చర్‌గా పని చేశాడు.



మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రం వేస్తున్న నవనీత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

యువతకు దిశానిర్దేశం



ఆర్ట్, డిజైనింగ్, ఇన్నోవేషన్ పై యువతకు దిశానిర్దేశం చేస్తా. డిజైనింగ్ రంగంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తా. సాంకేతిక, ప్రొఫెషనల్ అనుభవాలను విద్యా కార్యక్రమాలకు కథల రూపంలో పుస్తకాలను ప్రచురించే ప్రయత్నంలో ఉన్నాను.

– నవనీత్, హుస్నాబాద్